# కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వితంతువులు
- పింఛన్ పొందుతున్న భర్త చనిపోతేనే భార్యకు బదిలీ
- నిరుపేద వితంతువులకు కొత్త పింఛన్ మంజూరుకు మొండిచేయి

**గడివేముల:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేసిన దాఖలాల్లేవు. కనీసం ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేసేందుకు వెనుకంజ వేస్తోంది. దీంతో గడివేముల మండలంలోని ఆయా గ్రామాల్లో పింఛన్ల కోసం అర్హులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరీ పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. గడివేముల మండలంలో 5743 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త పింఛన్ల మంజూరు కోసం వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు, పీజీఆర్ఎస్ కార్యక్రమాలకు వందల సంఖ్యలో వెళుతున్నారు. అయితే నూతన పెన్షన్ల కోసం దరఖాస్తులకు ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. దీంతో పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్లు మంజూరు కాకపోవడంతో సమాధానం చెప్పలేక ఆయా గ్రామాల్లోని నాయకులు బయట తిరగలేకపోతున్నారు.


గడివేముల ఎంపీడీఓ కార్యాలయం

### గత ప్రభుత్వంలో ఠంచనుగా పింఛను

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ దరఖాస్తులను గ్రామ వలంటీర్లు సచివాలయాల్లో సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో చేయించేవారు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వెబ్‌సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. గతంలో పింఛన్ బదలాయింపు వంటివి లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. అదే విధంగా ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం 50 ఏళ్లు దాటిన వారే పింఛన్ల కోసం అర్జీలు ఇస్తున్నారు.


గత ప్రభుత్వంలో బొల్లవరంలో కొత్తగా మంజూరైన పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

### అవ్వాతాతలు, దివ్యాంగుల అవస్థలు

గడివేముల మండలంలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు, 14 సచివాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి ప్రకటన చేయలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు వస్తున్నారు. అయితే ప్రభుత్వం నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో తిరిగి వెళ్లుతున్నారు. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదని సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా పై సమాధానమే వస్తోంది.

### పింఛన్ దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలి



నా భర్త చాబోలు వెంకటేశ్వర్లు 2024 నవంబర్ 13వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నాకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త చనిపోయి జీవనోపాధి కోల్పోయిన నాకు వితంతు పింఛన్ రావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావొస్తున్న మా లాంటి వారిని పట్టించుకోకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త పింఛన్ దరఖాస్తుకు అవకాశం కల్పించి, వెంటనే మంజూరు చేయాలి.

– చాబోలు లక్ష్మీదేవి, గడివేముల

### కొత్త దరఖాస్తులకు అవకాశం లేదు



సామాజిక పింఛన్‌దారు డు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. వెబ్‌సైట్ ప్రారంభమైతే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన అనంతరం ఆయా గ్రామాల సచివాలయల్లో తెలియజేస్తాం.

– వాసుదేవ గుప్త, ఎంపీడీఓ, గడివేముల

## భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు

**గడివేముల:** జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి భారీవాహనాలు గడివేముల గ్రామంలోకి నిత్యం వస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారిలో గడివేములలోని పాత బస్టాండు ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గురువారం గడివేములలో సంత కావడంతో ఆరోజు ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఏ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గడివేములలోకి భారీ వాహనాలు రాకుండా బైపాస్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు బైపాస్ నిర్మాణంపై ఎటువంటి పురోగతి లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం మీదుగా కర్నూలుకు వెళ్లాల్సి ఉండగా మైలేజ్ కోసం గడివేముల మీదుగా భారీవాహనాలను నడుపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో పాతబస్టాండ్ ప్రాంతంలో లారీల కిందపడి ఇద్దరు చనిపోయిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా నియంత్రించడంతో పాటు తమ ప్రాణాలను కాపాడాలని, అలాగే బైపాస్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


గడివేముల పాతబస్టాండ్ వద్ద భారీ వాహనాల రద్దీ

## వివాహ వేడుకలో ప్రముఖులు

**పాణ్యం:** పాణ్యంకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ జనరల్ సెక్రటరీ చందమామ కుమార్తె షాహిన్ వివాహానికి పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నంద్యాలలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ హుసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు రామలక్ష్మయ్య, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, నాగేంద్రతో పాటు పలువురు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వధువును ఆశీర్వదిస్తున్న కాటసాని

## ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

**కల్లూరు:** 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. ఆదివారం ఉలిందకొండ గ్రామ ఆటో డ్రైవర్ల విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి జి.మధు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి కేవలం రూ.15 వేలు మాత్రమే ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. దీని వల్ల డ్రైవర్లకు ఒరిగేదేమీ లేదన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం సొమ్మును రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు బొగ్గుల బాష, నరేష్, శేఖర్, సుంకన్న, నవీన్, వెంకటేష్, శీను, దస్తగిరి, నాగయ్య, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


బొల్లవరంలో మురుగు పారేందుకు మార్గం చేస్తున్న దృశ్యం

## రోడ్లపైనే మురుగు

**కల్లూరు:** పుసులూరు గ్రామంలో డ్రైనేజీ కాలువ పూడికతో నిండడంతో కాలువలో ప్రవహించాల్సిన మురుగంతా రోడ్డుపైకి వస్తోంది. బురద ఉండటం వల్ల దోమలకు నెలవుగా మారుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వల్ల దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మురుగు, వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు కాలువలు సరిగా లేకపోవడంతో రోడ్డు పక్కన నిలుస్తోంది. మురుగు నీరు ముందుకు పారేలా ఓ వ్యక్తి సలికతో తాత్కాలికంగా మార్గం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పుసులూరులో రోడ్డుపై పారుతున్న మురుగు

### ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం

**కర్నూలు కల్చరల్:** అవోపా ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్ర అన్నపూర్ణగా పేరు ప్రఖ్యాతులు గడించిన డొక్కా సీతమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక అమీన్ హైదర్ ఖాన్ నగర్‌లో అన్నదానం చేశారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఆర్య వైశ్య యువతీ యువకులను అవోపా సేవా సదన్‌లో ఘనంగా సన్మానించారు. అవోపా అధ్యక్షుడు డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

### ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**కర్నూలు కల్చరల్:** ఉమ్మడి జిల్లాలో ఈనెల 16వ తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని రాగమయూరిలో సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని ఈ నెల 16న శ్రీశైలంలో స్వామివారి దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభకు రానున్నారన్నారు. సభకు హాజరు కావడంతో పాటు వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయన్నారు. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం



లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



**కల్లూరు:** కల్లూరు అర్బన్ పరిధి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారిపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం గ్రామానికి సుమారుగా రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనమవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డులోనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది. ఆ విద్యాలయం ముందు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. అక్కడి నుంచి కర్నూలు వైపు వస్తే మలుపు వద్ద మొత్తం రోడ్డు ధ్వంసమైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పితే ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే ఎడ్ల బండ్లపై పొలాలకు ఎరువులు, మందులు తీసుకెళ్లేవారు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణించాలంటే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

### సమర్థవంతంగా పనిచేయండి

**కర్నూలు (టౌన్):** ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటన పురస్కరించుకొని నగరపాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆయన ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఆధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమ్మతులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్, హెల్ప్ డెస్కులకు పూర్తి స్థాయి దృష్టి సారించాలన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విభాగం అధికారులు తమ పనులు సకాలంలో పూర్తి చేసి సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు కూలీల పోటు

- కిలో పత్తి తీసేందుకు కూలీ రూ.15
- అయినా దొరకని కూలీలు


చనుగొండ్ల సమీపంలోని పొలంలో పత్తిని తెంపుతున్న కూలీలు

ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ కింద 2,24,801 హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట చేతికి వచ్చింది. దిగుబడులు తొలగించే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈక్రమంలో పత్తి తీసే పనులకు కూలీలకు డిమాండ్ ఏర్పడింది. 10 రోజుల క్రితం వరకు కిలో పత్తి తీసే పనులకు రూ.11 నుంచి రూ.12 తీసుకునే కూలీలు ప్రస్తుతం రైతుల అవసరాలను బట్టి రూ.15 నుంచి రూ.16లకు పెంచేశారు. కిలోల ప్రాతిపదికన వద్దనుకుంటే రోజు వారి కూలీ రూ.400 ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పత్తి దిగుబడులను తీసే పనులకే అధిక మొత్తం ఖర్చు పెడితే పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు దక్కవంటూ రైతులు వాపోతున్నారు. మరికొందరు రైతులు కూలీలకు ఖర్చు పెట్టలేక కుటుంబ సభ్యులతో కలిసి చేతనైంత వరకు రోజు కొంచెం తీసుకుని నిల్వ ఉంచుకుంటున్నారు. కిలోల లెక్కన పత్తి తెంపుతున్న కూలీలకు మాత్రం డబ్బు పంట పండుతోంది. ఒక్కో కూలీ పోటీ పడి రోజుకు క్వింటం పత్తి తీస్తూ రూ.1500ల వరకు గిట్టుబాటు చేసుకుంటున్నారు.

> ఒక వైపు వర్షాల భయం.. మరోవైపు కూలీల కొరత రైతులను వెంటాడుతోంది. నిన్న మొన్నటి వరకు కురిసిన అధిక వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉన్న కాస్త దిగుబడులను దక్కించుకుందామంటే కూలీలు దొరకడం లేదు. కిలో రూ.15 చెల్లిస్తున్నా కూలీలు దొరకడం లేదని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కోడుమూరు రూరల్

### వెంటాడుతున్న వరుణుడు

ఈ ఏడాది పత్తి పంట సాగు చేసినప్పటి నుంచి వరుణుడు అతివృష్టి, అనావృష్టిల రూపంలో రైతులను వెంటాడుతూనే ఉన్నాడు. మొన్నటి వరకు అధిక వర్షాల వల్ల పత్తి పూత, కాయ రాలిపోవడంతో దెబ్బతిన్న రైతులు ప్రస్తుతం చేతికొచ్చిన పత్తి పంటను వరుణుడి నుంచి కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొంత మేర వర్షాలు తగ్గడంతో రైతులంతా చేతికొచ్చిన పత్తి పంటను తీసుకునేందుకు పోటీ పడుతుండగా, కూలీల కొరత రైతులను వెంటాడుతోంది.

### కిలో రూ.15 ప్రకారం ఇస్తున్నా..



వర్షాధారంగా పదెకరాల్లో పత్తి పంట సాగు చేశా. ప్రస్తుతం పత్తి చేతికొచ్చింది. తెంపేందుకు కూలీలు దొరకడం లేదు. కిలో పత్తి రూ.15ల ప్రకారం తెంపేందుకు ఒప్పందం చేసుకుని కూలీల చేత పత్తిని తెంపించుకుంటున్నాను. అయినా పూర్తి స్థాయిలో కూలీలు దొరకడం లేదు. వానలు పడితే పత్తి నాణ్యత దెబ్బతింటుందన్న భయం నెలకొంది.

– మహేశ్వరరెడ్డి, చనుగొండ్ల గ్రామం, గూడూరు మండలం

### పత్తి తీసేందుకే అధికంగా ఖర్చవుతోంది



నాలుగెకరాల్లో రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేశా. ప్రస్తుతం పంట చేతికి రావడంతో పత్తి తెంపేందుకు కూలీలను పిలిస్తే రోజు వారి కూలీ రూ.400లు, చార్జీకి డబ్బులు ఇవ్వాలని. కిలోల ప్రకారమైతే కిలో రూ.15లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కూలీల డిమాండ్‌తో పత్తి తెంపే పనులకే పంట విక్రయించగా వచ్చిన దాంట్లో సగం ఖర్చవుతోంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

– గిరి, వెంకటగిరి గ్రామం, కోడుమూరు మండలం

## క్లుప్తంగా

### ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

**ఓర్వకల్లు:** దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు రామచంద్రుడు ఆకాంక్షించారు. దీపావళి పండుగ పురస్కరించుకొని మండలంలోని ఎస్.కొంతలపాడు, హెచ్.కొట్టాల గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రామచంద్రుడు మాట్లాడుతూ.. 'గురువు తమ జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతిని వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనేందుకు గుర్తుగా దీపావళి రోజున ప్రతి ఇంట్లో దీపాలను వెలిగించాలని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు గోకారి, శ్రీనివాసులు, రవి, జగదీశ్, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా మ్యాన్ హోల్


తెరచి ఉన్న మ్యాన్ హోల్

**ఓర్వకల్లు:** డ్రైనేజీపై నిర్మించిన సీసీ రోడ్డుపై అక్కడక్కడ ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ వద్ద ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఇలాంటి పరిస్థితి నెలకొంది. స్థానిక సంత మార్కెట్‌లో నిత్యం వందలాది మంది ప్రజలు సంచరించే ప్రాంతంలో మురుగునీటి ప్రవాహం కోసం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మినరల్ వాటర్ ప్లాంట్ వరకు మురుగు కాల్వను నిర్మించారు. ఈ కాల్వపై సీసీ రోడ్డును నిర్మించారు. కాల్వను శుభ్రపరచేందుకు వీలుగా మూడు చోట్ల మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయకుండా ఓపెన్‌గా వదిలేశారు. దీంతో రాత్రివేళ అటుగా వెళ్లే ప్రజలు మైమరిచి కాలు పెడితే ప్రమాదానికి గురికావాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌పై మూతలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ఎక్సైజ్ కార్యాలయం వద్ద నేడు నిరసన

**కోడుమూరు రూరల్:** తెలుగుదేశం పార్టీ నాయకులు నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమలాగా తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్న వైనాన్ని నిరసిస్తూ సోమవారం కోడుమూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొంటున్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సతీష్ కోరారు.

### స్కేటింగ్ విజేతలకు మెడల్స్ ప్రదానం

**కర్నూలు (టౌన్):** స్కేటింగ్‌లో ప్రతిభ చాటిన చిన్నారులను నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేంద్ర అభినందించారు. రెండు రోజులుగా బి క్యాంపులోని ఖానా ఖజానా రోడ్డులో నిర్వహిస్తున్న స్కేటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆదివారం మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు స్కేటింగ్ క్రీడలో రాణించడం శుభ పరిణామమన్నారు. రోజూ సాధన చేసి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. రోడ్ రేస్, రింక్ రేస్‌లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. స్కేటింగ్ కార్యదర్శి అబుబకార్, సీఈఓ సునీల్ కుమార్ ఉన్నారు.

### గుంతలమయంగా కేఎంసీ రోడ్లు


మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ వద్ద రోడ్డు దుస్థితి

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు మెడికల్ కాలేజీలో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. ఐదేళ్ల క్రితం కళాశాల మొత్తంగా వేసిన సీసీ రోడ్లు నాసిరకంగా నిర్మించడం వల్ల అప్పుడే దెబ్బతిన్నాయి. దీంతో కళాశాలలో ఎక్కడ చూసినా గుంతలమయంగా, కంకర తేలిన రహదారులు దర్శనమిస్తున్నా యి. కళాశాల నుంచి బయటకు వెళ్లే దారిలో వర్షాకాలంలో రహదారిపైనే వర్షపు నీరు నిలవడం వల్ల వైద్యులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల కంకర తేలి ఉండటంతో బైక్‌లు, స్కూటీలపై వెళ్లే వారు జారి పడుతున్నారు. రహదారుల నిర్మాణం కోసం కళాశాల అభివృద్ధి సొసైటీలో నిధులున్నా అధికారులు వాటిని ఖర్చు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు అంతర్గత రహదారులపై దృష్టి సారించాలని వైద్యులు, విద్యార్థులు కోరుతున్నారు.

### పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరుకావాలి

**సి.బెళగల్:** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు.

### బంజారా జిల్లా అధ్యక్షుడిగా తిరుపాల్

**పాణ్యం:** మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామానికి చెందిన తిరుపాల్‌నాయక్ నంద్యాల జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఆలిండియా బంజారా సేవా సంఘం సమావేశంలో తిరుపాల్ నాయక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. బంజారాల హక్కుల కోసం పోరాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తిరుపాల్ నాయక్ అన్నారు. పలువురులు బంజారా సంఘాల వారు ఆయనకు అభినందనలు తెలిపారు.

### కర్నూలు ఉత్సవ్‌లో కళా ప్రదర్శనలు

**కర్నూలు కల్చరల్:** టీజీవీ కళాక్షేత్రంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కర్నూలు ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణపై ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని చారిత్రక అంశాలు, సాంస్కృతిక, సాహిత్య, సాంఘిక అంశాలను వెల్లడించే విధంగా ఉత్సవ్ ఉంటుందన్నారు. అలాగే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, సాహిత్య సభలు, వ్యాసరచన పోటీలు, తోలు బొమ్మలాట, బుర్రకథ, హరికథ, పౌరాణిక నాటక, ఏకాంకిక నాటక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. వారం రోజుల పాటు ప్రముఖుల ఛాయచిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కళాక్షేత్రం కార్యదర్శి, యాగంటీశ్వర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.